కథ

# యూనియన్ లీడరు

డా. కలువగుంట రామమూర్తి

**''ప్రభువెక్కిన పల్లికి కాదోయ్ – అది మోసే బోయీలెవ్వరు? తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలెవ్వరు?'' మైకులో నుండి ఒక కార్మికుడు ఆవేశంగా ఆలపిస్తున్న శ్రీశ్రీ కవిత రాజన్నకు లీలగా వినిపిస్తోంది. పదిహేను రోజులుగా వేసిన టెంట్లు వేసినట్లే వున్నాయి. జీతాలు పెంచలేదనే పంతానికి పోయి కార్మికులందరూ యజమాని మీద తిరుగుబాటుగా ప్రకటించిన సమ్మె వికటించే స్థితికి చేరుకుంది.**

యూనియను లీడరుగా రాజన్నకున్న పలుకుబడితో ఇన్ని సంవత్సరాలూ కర్మాగారంలోని కార్మికులకందరికీ న్యాయం జరిగేలా చూస్తూనే ఉన్నాడు. ఈ మధ్య, యువకులు కొందరు కార్మికులుగా చేరినప్పటి నుంచీ పట్టూ విడుపూ కోల్పోయి, అటు యాజమాన్యానికీ, ఇటు కార్మికులకూ కష్టనష్టాలూ కడగండ్లూ కొనితెస్తున్నారు.

రాజన్న ఈమారు అయిష్టంగానే సమ్మెకు అంగీకరించాడు. మొహమాటపడి కయ్యానికి కాలు దువ్వితే మొహం చూపించుకోలేని స్థితి ఇప్పుడు ఎదురయ్యిందతనికి. దీనికేదో మార్గం చూడాలన్న ఉద్వేగంతో తన గుడిసెలోనుండి సైకిలుపైన బయలుదేరాడు రాజన్న.

''రాజన్నా! ఏదో ఒకలాగా దొంగల్దోల కూడదా?'' అంటూ వీధిలో ఒక ముసలమ్మ పీక్కుపోయిన కళ్ళతో ఆశగా చూస్తూ అడిగింది. వెన్నెముకకు అంటుకుపోయిన డొక్కతో నీరసంగా ఉందామె అభ్యర్ధన.

''అన్నా! చిన్నోడు మంచాన పడ్డాడు. ఆసుపత్రి కెళ్ళాలంటే చిల్లర లేదాయె...'' ఒక ఇల్లాలు చిరిగిన చీరతో మాసిన జుట్టుతో దీనంగా చూస్తూ కొంగుతో కళ్ళద్దుకుంది.

రాజన్న ఆ మురికివాడ మధ్యలోనుండి పారుతున్న చిన్నచిన్న కుళ్ళు కాలువలను దాటుకుంటూ, తిరిగి సైకిలెక్కి తొక్కుతున్నాడు. మెతుకు చేరని ఖాళీ కడుపులలాగా మనుష్యులు కన్పించని ఆ గుడిసెలు బావురుమంటున్నాయి. ముంగిట వృద్ధులు, పసిపిల్లలు ఆకలిని మరచిపోవడానికి ఏదో ఒక వ్యాపకంతో గడుపుతున్నారు. రాజన్నకు ఆవేశం కట్టలు తెంచుకుంది. అతను సమ్మె చేస్తూ పస్తులు పడున్న కార్మికుల శిబిరాన్ని పాత సైకిలుపై చేరుకున్నాడు. నినాదాలు ఆగిపోయాయి. ఏదో శుభవార్త చెప్తాడని అందరూ అతనివైపు ఆశగా చూసారు. రాజన్న మైకును అందుకున్నాడు.

''సోదరులారా! ఏ ఎన్నికైనా పట్టూ విడుపూ వుంటేనే రాణిస్తుంది. నేను నడిపిన రాయబారంలో మన కోరికల్ని చాలావరకు యాజమాన్యం అంగీకరించింది. ప్రస్తుత ఆర్ధిక మాంద్యం కారణంగా వాళ్ళకు ఎదురైన దుస్థితిని వివరించి పరిస్థితులు చక్కబడ్డాక మన మిగిలిన డిమాండ్లను పరిశీలిస్తామని మాట...'' తన మాటకు అడ్డు తగులుతూ, తన చేతినుండి మైకును లాక్కున్న, ఒక యువ కార్మికుని వైపు ఆవేశంగా చూసాడు రాజన్న.

''కామ్రేడ్స్ ! యజమానులు చెప్తున్న కల్లబొల్లి కబుర్లు విని ఆందోళనను విరమించకండి. మనం లోకువ అయిపోతే మన డిమాండ్లు తీరవు...'' అంటూ రెచ్చగొట్టడం, దానికి అర్ధమనస్కంగా, అన్యమనస్కంగా అందరూ అంగీకరించడం రాజన్న గామనించాడు.

''యువ కార్మిక సోదరులకు ఆవేశం తప్ప ఆలోచనలు లేవేంటి? యజమాని కార్మికుల సంబంధం తండ్రీ కొడుకులలాంటిది. ఇరు పక్షాలు బాగున్నప్పుడే పురోగతి జరిగేది'' – అని తనలో తాను అనుకున్నాడు రాజన్న.

''తాజ్ మహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలెవ్వరు'' తిరిగి విప్లవ గీతాన్ని అందుకున్నాడొక యువకార్మికుడు. రాజన్న అతని చేతిలోని మైకును తీసుకున్నాడు.

''సోదరా! ఇలారా! శ్రీశ్రీ కవితలంటే శ్రమజీవుల ఆత్మావిష్కరణలు! కార్మికులందరూ వాటిని గౌరవిస్తారు. ఆ విషయాన్ని పక్కనబెట్టు'' – రాజన్న ఒక కోణాన్ని వాళ్ళకు ఆవిష్కరించి చూపాలనుకున్నాడు. ''కార్మిక సోదరులారా! తాజ్‌మహల్‌ను వాడెవడో కట్టాలనుకున్నాడు. వాడు కట్టాలనుకోవడానికి ముందే – ఏళ్ళ కొద్దీ పనిచేయడానికి కావలసినంతమంది కూలీలు దేశంలో సిద్ధంగానే వున్నారు. వాడు తాజ్ మహల్ కట్టడం వల్ల వీళ్ళు కూలీలైపోలేదు. వాడు కట్టకుండా వుండివుంటే ఈ కూలీలు నవాబులూ అయిపోయి వుండరు. వాడు తాజ్‌మహల్ కట్టబట్టే ఏళ్ళకొద్దీ వేలాదిమంది కూలీలు కడుపుకు ఇంత అన్నం తిని కటిననేలమీద తృప్తిగా నిద్రపోగలిగారు. ఇంకేంది.. ప్రభువెక్కిన పల్లకిని మోసే బోయీలెవరన్నావా? బోయీలకు అది వృత్తి. ఆ వృత్తిని చేస్తేనే వాళ్ళ కడుపులు నిండేది. బోయీలూ ప్రభువుల్లా పల్లకీలెక్కి కూచుంటే కడుపు నిండేదెట్టా? వాళ్ళను మోసేదెవ్వరు? దేన్నీ తెగేదాకా లాక్కండి. మధ్యే మార్గం అన్నింటికీ మంచిది. అది క్షేమం. కార్మికుల కష్టాలను యజమానులు గుర్తించి, కృతజ్ఞతతో మసలాలనీ, మజమానులు బాగుంటేనే మనమూ బాగుంటామనీ, కార్మికులూ తలపోయాలని, చేసిన ఉపదేశమే ఆ మహాకవి కవిత్వంలోని అంతరార్ధం. దాన్ని మరచిపోకండి'' అంటూ అతిశయాలతో అపార్ధాలతో యువకులు సృష్టిస్తున్న అనర్ధాన్ని కడిగి పారేసాడు రాజన్న.

మధ్య వయస్కులైన కార్మికులు అతని మాటలలోని అంతర్యాన్ని అర్ధం చేసుకున్నారు.

''అన్న చెప్పిందే కరెట్. ఈ సమ్మెను విరమిద్దాం. మనకు రావలసిన బకాయిలు మనం తీసుకుందాం. మన పిల్లాపాపల్ని చూసుకుందాం. ముందుముందు మన డిమాండ్లను పరిష్కరించకపోతే అప్పుడే తాడోపేడో తేల్చుకుందాం. మన యజమాని ఇప్పుడు మనకాడికి వస్తాడో రాడో చూద్దాం'' అని వాళ్ళు అంటూండగానే ఒక కారు వచ్చి ఆగిందక్కడ.

యజమాని కార్మికులందరినీ పరామర్శించాడు. నిమ్మరసంతోపాటు వాళ్ళకు హామీ ఇచ్చాడు. సమ్మెను విరమింపజేసాడు.

మురికివాడలోని గుడిసెల నుండి ఆనందం అంబరాన్ని అంటిందా అన్నట్లు పొగలు చెలరేగాయి. వీధులన్నీ కమ్మని కూరల వాసనలతో గుభాళించసాగాయి. అరుగుల ముందు మందు సీసాలు గలగలలాడాయి.

''వీరుడు.. సాధించుకొనొచ్చాడు. రా.. దిష్టి తీసి హారతిస్తా'' అంటూ గుడిసెలోకి తలవంచి

దూరొచ్చిన భర్త రాజన్నను చూస్తూ లచ్చివమ్మ లక్ష్మీ దేవిలా నవ్వింది.

''సరేలేయే! ఊరంతా నాకు భయపడితే నేను నీకు భయపడేలా వుంది'' అంటూ తాగిన నాటు సారా వాసన పసికట్టి కోపం నటిస్తున్న లచ్చువమ్మ వైపు కొంటెగా చూసాడు రాజన్న.

''ఊరిని ఉద్ధరించడానికి బాగానే పాటుపడతావు. ఇంటి ఊసే పట్టించుకోవు'' అంటూ కన్నీళ్ళు పెట్టుకుందామె.

''ఇంతలోకే ఇప్పుడేమైంది'' కంగారుగా అడిగాడు రాజన్న.

''ఇంతకంటే ఏం కావాలా? వాడా బ్రాంది షాపు ఓనరొచ్చి ఇంటిముందు ఇష్టమొచ్చినట్టు మొరిగాడు. ఇట్టాంటోడికి పెళ్ళామెందుకు? అని పోయె. అందరూ ఇంటుంటే ప్రాణం బోయిందనుకో.'' అవమానంతో తల వంచుకుందామె.



''వాడిని మొన్ననే నలుగురిలో తలదించుకునేలా తన్నాను. వాడికింకా బుద్ధి రాలేదా నా కొడుకు'' అంటూ ఆవేశంగా లేచాడు రాజన్న.

''మావా! వద్దు.. వద్దు'' అని లచ్చువమ్మ రాజన్న పంచె పట్టుకుని ఆపడానికి అడ్డుపడింది.

''వదలవే'' అంటూ ఆమెనూ తన్నాడు రాజన్న. ఆమె సన్నగా ఏడుపందుకోవడంతో ఆమెను అనునయించాడు. మొరటువాడైన తన మొగుడు అప్పుడప్పుడూ చూపే ఆదరణకే మురిసిపోయే అమాయకురాలు లచ్చువమ్మ.

''మావా! సాయంత్రం అట్లా గంగమ్మ గుడివరకు పోయొద్దామా?'' అంది గోముగా లచ్చువమ్మ.

''ఈ గంగమ్మలు, ఎల్లమ్మలు, సత్తెమ్మలు నీకు సావాసగత్తెలు. వాళ్ళతో నాకేం పని?'' పొగ వదులుతూ పొగరుగా అన్నాడు రాజన్న.

''అవున్లే కల్లుగంప గంగమ్మ నంజుళ్ళ సాకనా సత్తెమ్మ, ఊరు దాటినాక వచ్చే బ్రాందిషాపు ఎల్లమ్మ నీకు సావాస కాపులని నాకు తెలుసులే'' లచ్చువమ్మ ఎత్తిపొడిచింది.

''ఒసే! నీకింత వయసొచ్చినా జారుడు మాటలు పోలేదే'' అంటూ భార్యను దగ్గరకు తీసుకున్నాడు రాజన్న.

రాత్రి చాలా పొద్దుపోయింది. వాడ నిర్మానుష్యంగా వుంది. రాజన్నకు చిన్నిల్లు జ్ఞాపకమొచ్చింది. నెమ్మదిగా తలుపు తీసుకుని, కుక్కలకు అలికిడి వినిపించకుండా, బయలుదేరాడు రాజన్న. రాత్రి జరగవలసిందంతా జరిగింది. కాని చీకటి ముసుగు తొలగే దాకా ఆ దృశ్యం కన్పించలేదెవరికీ.

ఉదయాన ఊరంతా అలికిడి చోటు చేసుకుంది. లచ్చువమ్మ ఒళ్ళు తెలి



యని నిద్ర నుంచి మెలుకవలోకి వచ్చింది. ప్రక్కన భర్త కన బడలేదు. ఆమెకది అలవాటే.

''రాజన్నా..! రాజన్నకా..! ఎక్కడ? ఎవరు కొట్టారు.?'' అనే ఆందోళనతో కూడుకున్న వాడ జనం మాటలకు లచ్చువమ్మ వెలికి వచ్చింది. ఆమె కాళ్ళు వణికాయి. కళ్ళు భైర్లు



కమ్మాయి. పరుగు పరుగున జనంతో పాటూ పడుతూ లేస్తూ పొలిమేర చెరువు గట్టును చేరుకుందామె.

రాజన్న నెత్తురు మరకల బట్టలతో మూలుగుతూ చెట్టుక్రింద పడువున్నాడు. దూరానికి మనిషి మూలుగు వినిపిస్తోంది. లచ్చువమ్మ గుండె చెరువైంది. ఆసుపత్రిలో చేర్చి తమ రక్తమిచ్చి రాజన్నను కాపాడుకున్నారు వాళ్ళు.

కొద్ది రోజులకే రాజన్న కోలుకున్నాడు. ఆనాటి రాత్రి తనకు బకాయి క్రింద ముట్టిన డబ్బులు, వాచీ, బంగారు గొలుసు అన్నీ పోయాయి. తలమీద బడితెతో ఎవరో మోదిన శబ్దం ఇంకా తనకు లీలగా వినిపిస్తోంది. దీనికి కారణం ఎవరై వుంటారనే దానికి సమాధానం ఎవరికీ ఖచ్చితంగా తెలిసిరాలేదు. రాజన్నలో ఇప్పుడు ప్రతీకార వాంఛ కూడా పారిపోయింది.

రాజన్నకు జ్ఞానోదయమయినట్టనిపించింది లచ్చువమ్మకు. ఊరి పొలిమేర గుట్టమీద రచ్చబండ రావిచెట్టు నీడలో గోచితో కాలం గడుపుతున్న అవధూత ఆమెకు జ్ఞాపకం వచ్చాడు. ఆయనవద్దకు పోదామంది. రాజన్న ఒప్పుకున్నాడు. నెమ్మదిగా భార్యాభర్తలిద్దరూ కొండమెట్లెక్కి రావిచెట్టును సమీపించారు.

ఏవో పిచ్చి నవ్వులు నవ్వుకుంటూ, దిక్కులు చూసుకుంటూ ఎవరేది పెడితే అది తింటూ పెరిగిన జుత్తుతో, గాలికి కదలాడే పొడవాటి గడ్డంతో, తమవైపు నవ్వుతూ చూస్తున్న అవధూత కాళ్ళకు మొక్కింది లచ్చువమ్మ. భర్తచేత మొక్కించింది.

''సామీ! ఈయన మా ఆయన'' అంది.

''కొండ కిందున్న ఫ్యాక్టరీలో యూనియన్ లీడరు స్వామీ! ఇతను నాకు ప్రాణ మిత్రుడు'' అన్నాడు మరో కార్మికుడు. రాజన్న చుట్టూ అతని దగ్గరి సావాసగాళ్ళు గుమికూడారు. రాజన్నకు రక్ష కట్టమని అవధూతను వేడుకున్నారు. ఆ అవధూత మహిమలు ఆ ప్రాంతమంతా వ్యాపించి వున్నాయి. కానీ ఎవ్వరినీ దగ్గరకు రానీయడు. వస్తే తిడుతాడు. కర్రతో కొడతాడు. పిచ్చిగా అరుస్తాడు. లచ్చువమ్మ కన్నీళ్ళకు ఆయన కూడా కరిగాడేమో శాంతంగా చూసాడు వాళ్ళను.

''ఏంటి బిడ్డా!'' అన్నాడు ఆప్యాయంగా.

''మా ఆయనకు రక్షగా ఏదైనా తాయెత్తు కట్టివ్వండి సామి'' చేతులు జోడించిందామె.

''..........'' రాజన్నకేసి తదేకంగా చూసాడు. పెద్దగా నవ్వాడు అవధూత.

''వీడేం చేస్తాడు'' ఉగ్రంగా చూస్తూ అడిగాడు. రాజన్నకు దడ పుడుతోంది.

''యూనియన్ లీడరు'' అన్నారు మిత్రులు.

''వీడు.. యూనియన్ లీడరు. ఒరే... నీ శరీరమే పెద్ద కర్మాగారం బిడ్డా. అందులో కార్మికులు.. ఆ కర్మాగారంలో పన్జేసే ఇంద్రియాలే కార్మికులు. ఏం – అర్థమైందా'' గద్దించాడు. చదువు సంస్కారం ఉన్నట్టు కనిపిస్తున్న అతను ఎప్పుడూ పిచ్చివాడిలా నటిస్తూ ఎందుకుంటాడో వాళ్ళకు అర్థం కాలేదు,

''అర్థమైంది సామీ!'' రాజన్న వణుకుతూ చేతులు జోడించాడు అవధూతకు.

''నీ శరీరంలో మనసుతో కూడిన పంచేంద్రియాలు ఒక యూనియన్. ఆ యూనియన్‌కు నాయకుడు కాలేని నువ్వు... బుద్ధిలేని వెధవ్వి. బడుద్దాయ్‌వి. ఏ యూనియన్‌కు లీడరువురా చవటా నువ్వు..'' గర్జించాడు. రాజన్నను కాలితో తన్నాడు. పక్కనున్న గులక రాళ్ళను రాజన్న మీదకు విసురుతూ అరుస్తూ ఆ అవధూత తరుముకున్నాడు.

లచ్చువమ్మ, రాజన్న, అతని మిత్రులు అందరూ కొంత దూరం పారిపోయారు. ఆ తన్ను తనకు వెన్నుదన్నుగా తోచింది రాజన్నకు.

''మీరు వెళ్ళండి నేను వస్తాను'' అంటూ ఒక రాతిబండ మీద కూలబడ్డాడు రాజన్న. అవధూత మాట అతనికి గీతోపదేశంలా వినిపిస్తూ ఉంది.

★

చిరునామా:
డా. కలువగుంట రామమూర్తి
శ్వేత రెసిడెన్సీ, ఎ 302, 4వ క్రాస్, రైల్వే కాలనీ,
తిరుపతి – 517 501
సెల్: 9247499120

## కథాకళి

# లోతు తెలిస్తేనే ఫలితం

'రండి స్వామీ రండి!' ఇంటి ముందు నుంచి వెళ్తున్న సన్యాసిని ఆదరంగా ఆహ్వానించాడు రమణయ్య.

తన పేదరికం బయటపడకుండా అన్ని మర్యాదలూ చేశాడు. తనకోసం వండుకున్న అన్నం, కూర సన్యాసికి వడ్డించాడు. అన్ని విధాలా పరిచర్యలు చేశాడు. సన్యాసి ఎంతో సంతసించాడు.

'రమణయ్యా... నీ పరిస్థితిని నేను గుర్తించాను. నీకు ఒక వరం ఇవ్వాలనుకున్నాను' అన్నాడు సన్యాసి.

'స్వామీ ధన్యుణ్ని. మీ అనుగ్రహం' అన్నాడు రమణయ్య.



'మీ ఇంట్లో ఈశాన్యం మూలలో తవ్వుకో. నీకు లంకెబిందెలు దొరుకుతాయి. కానీ మొదటిసారి తవ్వినపుడు మాత్రమే అవి దొరుకుతాయి. రెండోసారి ప్రయత్నిస్తే దొరకవు' అన్నాడు సన్యాసి.

రమణయ్య సంతోషంతో ఉబ్బితబ్బిబ్బయ్యాడు. సన్యాసి అటు వెళ్లగానే ఈశాన్యం మూలలో తవ్వకం మొదలు పెట్టాడు. ఐదు అడుగులు తవ్వాడు. పది అడుగులు తవ్వాడు. పదిహేను అడుగులు తవ్వాడు. ఇరవై అడుగులు... ముప్పై అడుగులు... 50 అడుగులు... డెబ్బై... ఎనభై... తొంభై... తొంభై తొమ్మిది...

రమణయ్యకు విసుగొచ్చింది. అలసట వచ్చింది. ఆగ్రహం వచ్చింది. ఆపేశాడు.

'లంకెబిందెలు లేవు. ఏమీ లేవు. సన్యాసి నన్ను మోసం చేశాడు' అని అనుకున్నాడు. సన్యాసికి గుణపాఠం చెప్పాలనుకుని, అతన్ని వెతుక్కుంటూ బయల్దేరాడు. దారిలో సన్యాసి కనిపించగానే...

'ఏమయ్యా నేను నీకు అన్నంపెట్టి ఆదరిస్తే, నువ్వు నాకు అబద్ధం చెప్పి మోసగిస్తావా? నువ్వు చెప్పినట్టు ఈశాన్యం మూలలో 99 అడుగుల దాకా తవ్వాను. అయినా లంకె బిందెలు కాదు కదా; ఒక్క బంగారు కాసు కూడా దొరకలేదు' కోపంగా అడిగాడు రమణయ్య.

'అయ్యయ్యో... 99 అడుగులు తవ్వావా? మరొక్క అడుగు తవ్వితే సరిపోయేదే! సరిగ్గా వంద అడుగుల లోతులో ఉన్నాయి లంకె బిందెలు. ప్చ్. కానీ ఇప్పుడేం లాభం? రెండోసారి తవ్వితే అవి దొరకవే' బదులిచ్చాడు సన్యాసి!

**నీతి :** ఏ పని చేయడానికైనా పటిష్ఠమైన ప్రణాళిక ముఖ్యం. లంకె బిందెలు కావాలంటే ఏ దిక్కున తవ్వాలో తెలిస్తే సరిపోదు. ఎంత లోతు తవ్వాలో కూడా ముందే తెలుసుకోవాలి. సలహా చెప్పేవాడికి స్పష్టత లేకున్నా, పని చేసేవాడు కచ్చితంగా అడిగి అన్నీ తెలుసుకున్న తర్వాతే పని మొదలుపెట్టాలి. లేకపోతే విజయానికి ఒక్క అడుగు దూరంలో నిలిచిపోక తప్పదు. తేడా ఒక్క అడుగే అయినా... అపజయం అపజయమే!

– తిగుళ్ళ కృష్ణమూర్తి